

# ఆత్మఘోష

## ఇలపావులూరి మురళీమోహనరావు

**నేనీ భూప్రపంచంలో ఎవరికీ భయపడను. దేవతలు, దెయ్యాలు, సింహాలు, పులులు, పాములు, తేళ్లు అంటే డోన్ట్ కేర్. జానెడు దూరంలో పిడుగు పడినా రెప్పార్పకుండా నిల్చోగలను. అలాంటి నన్ను విపరీతంగా భయపెట్టగల జీవి ఈ సృష్టిలో ఒకడే! అతడు క...వి!**

**ఒక రాజకీయ నాయకుడు ఉపన్యసించాలంటే అతనికి కంటిచూపు అందినంతమేర జనం ఉండాలి. ఒక టీచర్ పాఠం చెప్పాలంటే క్లాసులో కనీసం పదిమంది పిల్లలైనా ఉండాలి. కానీ ఈ కవి అనే జీవికి ఒక్కడు చాలు! అతడిని చిత్రహింసలు పెట్టి చంపగలడు. అందుకేనేమో, ఈ కవులకు 'కవి కంఠీరవ, కవికేసరి, కవిపుంగవ'లాంటి బిరుదులిస్తూంటారు. కంఠీరవానికి ఒక్క ప్రాణి కనపడినా తన పంజాదెబ్బతో చీల్చి చెండాడుతుంది. పుంగవం తన వాడియైన కొమ్ములతో కుమ్మేస్తుంది. హానికరమైన ఈ జంతువులతో కవిని పోల్చడం సమంజసమేమో అనిపిస్తుంది**

ఎందుకంటే

ట్రాన్స్‌ఫర్‌మీద ఈ సిటీకి వచ్చాను. ఎక్కడికైనా కొత్తగా వచ్చినవాడికి మొదట ఎదురయ్యేది ఇంటి సమస్య. నగరాలలో అద్దె ఇల్లు దొరకడం అంత తేలిక కాదు. అన్ని వసతులూ ఉండాలి. మనం వాళ్లకు నచ్చాలి. వాళ్లు అడిగే అద్దె మనం ఇవ్వాలి. ఈ విషయంలో ఇల్లు ఇచ్చేవాడూ, పుచ్చుకునేవాడు ఇద్దరూ హిరణ్యాక్షులే.

ఆఫీసుకు కొంచెం దగ్గర ప్రాంతాల్లో ఇంటి అద్దెలు ఘోరంగా ఉన్నాయి. రెండు గదుల ఇల్లు రెండువేలకు తక్కువ లేదు. తిరిగి తిరిగి తిరిగి వినుగెత్తింది.

ఒక ఇంటావిడతో మాట్లాడుతూండగా, "అసలు మీకు ఇల్లు ఎంతలో కావాలి?" అని అడిగింది

"ఏడెనిమిది వందలలో!" చెప్పాను.

"అయితే కవుల బజారులో ప్రయత్నించండి!" అని చెప్పింది.

ఆ తరువాత మరికొందరిని అడిగాను.

"ఆ రేంజ్‌లో అయితే కవుల బజారులో దొరుకుతుంది" అని ముక్తకంఠంతో సెలవిచ్చారు.

వాళ్లను వీళ్లను అడిగి చివరకు కవుల బజారును పట్టుకున్నాను. ఆ బజారులో చాలా ఇళ్లు ఖాళీగా ఉన్నాయి. ఒక ఇంటి తలుపు తట్టాను. ఒకావిడ తలుపు తీసింది.

"నమస్కారమండీ! ఈ ఇంట్లో రెండు గదులు అద్దెకు దొరుకుతాయా?" అడిగాను.

ఆమె ముఖం చాటంత అయింది.

"రెండు గదులేం ఖర్మ, నాలుగున్నాయి. అన్ని వసతులూ ఉన్నాయి. బోరింగు, మోటారు, ఓవర్ హెడ్ టాంకు ఉన్నాయి. ఇల్లంతా మార్బల్ స్టోన్. అల్మైరాలు, కిటికీలు, అటకలు ప్రతి గదిలోనూ రెండున్నాయి. రెండు వందలు అద్దె. మీరు పదేళ్లున్నా అద్దె పెంచం. ఎంతమంది చుట్టాలొచ్చినా, ఎన్ని నీళ్లు వాడినా నోరెత్తం. అడ్వాన్సు అవసరం లేదు. ప్రతి నెలా అద్దె ఖచ్చితంగా ఇవ్వాలని లేదు. రెండుమూడు నెలలకొకసారి ఇచ్చినా ఏమీ అనం. ఎప్పుడు చేరుతున్నారు?" ఆంజనేయ దండకంలా చదివింది.

నన్ను నేను గిల్లి చూసుకున్నాను. చురుక్కుమంది కాబట్టి నశ్వరమైన ఈ దేహంలో రక్తమాంసాలు ఇంకా ప్రవహిస్తున్నాయని, పిడికిలంత గుండెకాయ కొట్టుకుంటూనే ఉన్నదని నిర్ధారించుకున్నాను.

"అమ్మా! ఇది శ్రీకృష్ణదేవరాయల కాలమా, లేక చంద్రబాబునాయుడి కాలమా? ఇది

విజయనగరమా, లేక భాగ్యనగరమా?'' గుండె చిక్కబట్టుకుని అడిగాను.

"భలేవారే! ఎందుకా సందేహం? ఇది భాగ్యనగరంలోని విజయనగర్ కాలనీ!'' నవ్విందామె.

"ఏం లేదులెండి, ఎందుకో డౌటొచ్చింది. అవునూ, దీన్ని కవుల బజారు అంటున్నారు. అల్లసాని పెద్దన, నన్నయ తిక్కనలుగానీ, విశ్వనాథ, శ్రీశ్రీలాంటివారుగాని ఒకప్పుడు ఈ బజారులో ఉండేవారా?'' అడిగాను.

"ఆ చరిత్రలు నాకు తెలియవండీ! ఇంతకూ ఎప్పుడు చేరుతున్నారు?''

"రేపు చేరుతా!'' అని చెప్పబోతుండగా వెనకనుంచి చప్పట్లు వినిపించాయి. ఎదురింటామె సైగలతో నన్ను పిలుస్తున్నది. వెళ్లాను.

"ఎంత చెబుతున్నది అద్దె?'' అడిగింది.

"నాలుగు గదులు రెండువందలు!'' హుషారుగా చెప్పాను.

అంతే!

దేవదాసులో అక్కినేని పీకలదాకా మందు కొట్టి 'జగమే మాయ, బ్రతుకే మాయ' అంటూ ఒత్తులు, దీర్ఘాలూ కరెక్టుగా పలుకుతూ శ్రుతిలయ తాళబద్ధంగా పాడి చివర్లో దగ్గో, నవ్వో తెలియని విధంగా శబ్దాలు చేసినట్లు దగ్గుతూ నవ్వి, నవ్వుతూ దగ్గి రకరకాల విన్యాసాలు చేసింది.

"ఏమిటండీ?'' అన్నాను ఆశ్చర్యంగా.

"మానవ జీవితం ఎంత నికృష్టమైనది? కొత్తవారిని ఎంత సులభంగా మోసం చేస్తారు?''

"లేకపోతే, నాలుగు గదులూ రెండువందలా! మా ఇంట్లోని నాలుగు విశాలమైన గదులూ ఇంతకుముందు నూట ఎనభైకే ఇచ్చాము. ఇప్పుడు మరో ఇరవై తగ్గించి నూట అరవైకే ఇవ్వాలనుకుంటున్నాము. ఇల్లు అల్ట్రా మాడరన్. గోడలన్నింటికీ టైల్స్ వేయించాము. విశాలమైన హాలు, అటాచ్‌డ్ బాత్‌రూమ్స్, గీజర్లున్నాయి. ఇరవైనాలుగ్గంటలూ వాటర్ వస్తుంది. అద్దె డబ్బులు ఆరునెలలకోసారి ఇచ్చినా పట్టించుకోము. మీ ఇంట్లో ఎవరికైనా ఆరోగ్యం బాగాలేకపోతే మా ఇంట్లోనుంచి వంట చేసి పంపుతాం. మా ఫ్రిజ్ మీరు వాడుకోవచ్చు. కలర్ టీ.వీ. చూడొచ్చు. పైగా, మీకు ఎప్పుడైనా కోపం వచ్చి మమ్మల్ని తిట్టి దిగపారబోసినా కిక్కురుమనం!'' అన్నది.

నోట మాట రాలేదు నాకు. కొంపదీసి నేనేమైనా బహిరంగ పిచ్చాసుపత్రికి వచ్చానా అని అనుమానం వచ్చింది. తల పైకెత్తి చూశాను. ఆకాశం నీలంగా ఉన్నది. మేఘాలు నడుస్తున్నాయి. కిరాణా కొట్లు, కిళ్లీబడ్డీలు, ఆడుకుంటున్న పిల్లలు, మామూలుగా తిరుగుతున్న పెద్దలు ... వాతావరణమంతా నార్మల్‌గానే ఉంది. తెల్లకోటు వేసుకుని తిరుగుతున్న డాక్టర్లు, అంబులెన్స్‌లు, మందుల వాసనలు వగైరాలేమీ లేవు. సినిమాలలో చూపిస్తున్నట్లు వికారంగా అరుస్తూ, తిట్టుకుంటూ, జుట్లు పీక్కుంటూ తిరుగుతున్న పేషెంట్లు ఎవరూ లేరు.

"రేపే చేరుతామండీ!'' చెప్పాను.

మరునాడుదయమే సామాన్లతో దిగాను. నా భార్య సుందరి ఇల్లు చూసి తెగ మురిసిపోయింది.

ఆరోజు సాయంత్రం వరండాలో కూర్చుని ఉండగా ఎవరో పెద్దమనిషి గేటు తెరుచుకుని వస్తున్నాడు. పంచె, లాల్చీ ధరించాడు. వెనుకవైపు అవశేషాల్లాగా కొన్ని వెంట్రుకలు తలనంటుకుని ఉన్నాయి. చంకలో పేపర్ల దొంతర. భుజంమీద ఎర్రని శాలువా మెరుస్తోంటే ఎవరో కమ్యూనిస్టు పార్టీ నాయకుడై ఉంటాడనుకుని లేచి నిలుచున్నాను.

"నమస్కారం! నా పేరు కవిపుంగవ కవీంద్ర. మొదటిది నా బిరుదు. రెండవది నా పేరు. ఈ వీధిలో కుడిచివర ఇల్లు!'' పరిచయం చేసుకున్నాడు.

"నా పేరు వెంకట్రావు. అద్దంకి నుంచి ట్రాన్స్‌ఫరై వచ్చాను. కూర్చోండి. ఏం చేస్తుంటారు?''

"సర్వీసునుండి రిటైరయ్యాను. ప్రస్తుతం వ్యవసాయం చేస్తున్నాను!'' చెప్పాడు.

"ఈ సిటీలో ఉంటూ కూడా వ్యవసాయం చేస్తున్నారా! ఈ చుట్టుపక్కల పల్లెల్లో మీకు పొలాలేమైనా ఉన్నాయా?''

"అబ్బె...బ్బె... ఆ వ్యవసాయం కాదు. కవితా సేద్యం. సాహిత్యరంగమే నా క్షేత్రం. అక్షరాలే నేను చల్లే బీజాలు. కవితలు, గేయాలే నేను పండించే ధాన్యం. నేను వెలువరించిన కవితా సంకలనాలే నా ధాన్యపు పాతరలు!'' పెద్దగా నవ్వాడు కవీంద్ర.

సుందరి రెండు కప్పులు కాఫీ తెచ్చింది.

"నా భార్య సుందరి!'' పరిచయం చేశాను.

"కూర్చోమ్మా. ఓ కవిత వినిపిస్తాను. ఈమధ్య రైల్లో కాశీ వెళ్తుండగా దారివెంట పండ్లచెట్లు చూసి ఐడియా వచ్చింది. అవధరించండి!

"చెట్టునంటి ఉంటే మామిడికాయ
జాడీలో చేరితే ఊరగాయ
మిక్సీలో రుబ్బితే రుచి అంతా చచ్చు
రోట్లో తొక్కితే స్వర్గం దిగివచ్చు!'' ఆపి

విరగబడి నవ్వాడు కవీంద్ర.

నవ్వు రాకపోయినా నవ్వవలసి వచ్చింది.

ఆవిధంగా మొదలెట్టి బస్సులో వెళ్తూ అది రాశాననీ, రిక్షాలో వెళ్తూ ఇది రాశాననీ, కూరలు



## మళ్లీ మొదటికా?

అక్షయ్ కుమార్‌కు గుడ్ బై చెప్పిన తర్వాత తన కెరీర్ మీదే శ్రద్ధ చూపిన రవీనాటాండన్‌కు ప్రస్తుతం జీవితం అద్భుతంగా గడుస్తొందనే చెప్పాలి. 'సత్య, కౌన్' చిత్రాలకు స్క్రిప్టును అందించిన అనురాగ్ కేశవ్, రవీనల పరిచయం ఖాళీసమయంలో మాట్లాడుకోవటంతో ప్రారంభమై, కలిసి అవార్డు ఫంక్షన్‌కు హాజరవటం దాకా వచ్చింది. అంతే కాదు, ఈ మధ్య రవీన పృథ్వీ థియేటర్ దగ్గర తరచూ కనబడుతోందట. ఈ విషయమే అడిగితే అనురాగ్ దాన్ని అంగీకరించటం లేదు. "నేను పెళ్లయినవాణ్ని. ఇలాంటి అఫైర్స్ పట్ల నాకు ఆసక్తి లేదు'' అని చెబుతున్నాడు. మరో పక్క రవీన యింటికి దగ్గరగా వున్న బీచ్‌లో రిహార్సల్స్ చేస్తూ జనం కంట పడ్డారట. దాంతోపాటు "రవీన ఎంత అద్భుతనటో 'శూల్' చిత్రం చూస్తే అర్థమవుతుంది'' అని కూడా అంటున్నాట్ట. దాంతో ఆగక "రవీన సమక్షంలో ఎలాంటి వ్యక్తి అయినా చాలా కంఫర్టబుల్‌గా ఫీలవుతాడు'' అని ఓ స్టేట్‌మెంట్ కూడా పారేశాడు. ఏం, రవీనా? అక్కీ విషయంలో జరిగిందంతా మరిచిపోయావల్లే వుందే! కెరీర్ చూసుకో ముందు!

## మగాడంటే అలా వుండాలి!

విక్రమ్ భట్‌తో చెట్టపట్టాలేసుకు తిరిగిన మాజీ విశ్వసుందరి సుస్మితాసేన్ ఎందువల్లనో తమ అనుబంధం ముగిసిపోయిందని ప్రకటించింది. ఇందుకు కారణం సంజయ్ కపూర్ అని కూడా వదంతులు వ్యాపించాయి. "నేను నిజాయితీగా వుంటాను. ఎలాంటి లౌక్యమూ ప్రదర్శించలేను. తెర వెనుక నటించలేను" అని చెప్పే సుస్మిత, నీకెలాంటి మగాడు నచ్చుతాడని అడిగితే "పురుషుల్లో మొదట నాకు ఫిజిక్ నచ్చుతుంది. అతని ప్రవర్తన కూడా ముఖ్యమే. దాంతోపాటు చక్కగా శుభ్రంగా గడ్డం చేసుకునుండాలి. మీసాలుండకూడదు. ఇంకా... సమయానికి తగ్గ హాస్యం కూడా వుండాలి" అంది. మరి విక్రమ్ భట్ సంగతేమిటంటే, "అతను నన్నో చిన్నపిల్లలా ట్రీట్ చేస్తాడు. అచ్చంగా ఓ తండ్రిలాగే! నాకలాంటి వారే కావాలి" అని చెప్పింది. అంటే యిది విక్రమ్ భట్‌ను వుద్దేశించే అన్నట్లా? కానట్లా?



కొంటుంటే ఈ ఐడియా వచ్చిందనీ ... ఒకటొకటే చదవసాగాడు. సమయం పదిన్నర అయింది.

పరుగిడుతున్న కాలాన్ని కానీ, మా ముఖాలలో మారుతున్న రంగులను కానీ, ఆకలితో నకనకలాడుతున్న మా పేగులు చేస్తున్న దీనాలాపనలను కానీ ఆయన అసలు పట్టించుకోవడంలేదు. తొలి పరిచయం కావడంతో మొహమాటంతో ఏమీ అనలేక ప్రసవవేదన పడుతున్నాము.

రాత్రి ఒంటిగంటవరకూ మమ్మల్ని హింసించి మళ్లీ రేపు వస్తానని వార్నింగిచ్చి సెలవు తీసుకున్నాడు కవీంద్ర. అప్పుడు వంట చేసుకునే ఓపిక లేక మంచినీళ్లు తాగి పడుకున్నాము. కడుపు కాలిపోతూండటంతో ఏ మూడు గంటలకో నిద్రపట్టింది.

తెల్లవారుజామున ఐదు గంటలకు కాలింగ్ బెల్ మోగింది. కళ్లు నులుముకుంటూ తలుపు తీశాను.

"శుభోదయం, వెంకట్రావుగారూ! నా పేరు సింహాద్రి. అందరూ కవికేసరి అంటారు. అభిమానులు కవికంఠీరవ అంటారు. ఈ వీథిలో ఎడమవైపు చివరిల్లు!" అన్నాడు తానే కూర్చుంటూ.

"కూర్చోండి!" అన్నాను. ఇంకా నిద్రమత్తు వదలలేదు. మొహమాటంతో తరువాత రమ్మని చెప్ప లేకపోయాను.

"అందరికీ తాగుడు, పేకాటలాంటి వ్యసనాలున్నట్లే నాకూ కవితలల్లటం ఓ వ్యసనం. ఎన్నో కవితలు, గేయాలు, పద్యాలూ, హైకూలూ, పాటలూ రచించాను. మీలాంటి రసజ్ఞులు దొరికినప్పుడు వినిపిస్తే కానీ నాకు మనశ్శాంతి ఉండదు. మొన్న టాయ్‌లెట్లో కొంచెం అవస్థపడుతున్నప్పుడు ఈ కవిత నా కలంలో ఊపిరిపోసుకుంది.

"అతి చిన్న మలబద్ధకాన్ని అరికట్టలేని మానవుడా!

అంతరిక్షం కొరకు ఎందుకు ఆరాటపడతావు?

హి...హి... హి...హ్హా... హ్హా.... అతి చిన్న .... అంటే చాలా చిన్నదైన ...." అంటూ అర్థాన్ని వివరించసాగాడు.

నాకు మండుకొచ్చింది. "ప్రతిపదార్థం వద్దలెండి, నాకు అర్థమవుతూనే ఉన్నది!" విసుక్కున్నాను. ఆయన తొమ్మిదిన్నర వరకూ పీడించి వదిలాడు.

మాకు శనిమహర్దశ మొదలైందని రెండురోజులలోనే అర్థమైంది. ఉదయం సింహాద్రి, సాయంత్రం కవీంద్ర రాహుకేతువుల్లా పీడించసాగారు.

"వీరివల్లనే ఈ వీథిలోకి ఎవరూ అద్దెకు రావడంలేదు. ఇంటావిడ మనలను మోసం చేసింది. ఎరక్కపోయి ఇరుక్కున్నాము!" ఏడుస్తూ అన్నది సుందరి.

ఓరోజు సాయంత్రం కవీంద్ర తన కవితలను వినిపిస్తుంటే అడిగాను "మీకు భార్యాపిల్లలున్నారు కదా! వారికి వినిపిస్తారా?"

"వారు వినరండీ!"

"వాళ్లకు మీరు తిండి, బట్ట, నీడ ఇస్తారు. డబ్బులిస్తారు. వారే మీ కవిత్వం వినకపోతే మేమెందుకు వినాలి?"

"నా కవిత్వం మీలాంటి పండితులకోసం వెంకట్రావుగారూ!" నవ్వుతూ అన్నాడు కవీంద్ర.

ఖండించడానికి నోరు రాలేదు నాకు.

వీరిని వదిలించుకోవడమెలాగా అని తీవ్రంగా ఆలోచించాము. సగం జుట్టు రాలిన తరువాత ఒక ఐడియా వచ్చింది.

ఆరోజు కవీంద్ర వచ్చి కట్ట విప్పాడు.

"కవీంద్రగారూ! పొద్దున పాలకు వెళ్తుంటే ఈ ఐడియా వచ్చింది.

"డికాక్షన్ నల్లన.. పాలు తెల్లన

రెండూ కలిసిన కాఫీ ఎర్రన! ఎందువలన?" ఇలా పది వినిపించాను. కవీంద్రను గుక్క తిప్పుకోనివ్వలేదు.

కవీంద్రకు చెమటలు పట్టాయి. మళ్ళీ వస్తానని వెళ్లాడు.

పొద్దున్నే సింహాద్రి వచ్చాడు.

"ఈ కవిత వినండి, కవిగారూ! నిన్న మధ్యాహ్నం ఆఫీసులో మంచి కల వచ్చింది. ఈ ఐడియా వచ్చింది.

"సినిమా తారలు కలలోకి రావాలని

కలవరించి నిదురిస్తే

పండరీబాయి, నిర్మల వచ్చారు.

నగ్మా వస్తుందనుకుంటే

నాయనమ్మలొచ్చారు!" ఇలా ఓ డజను వినిపించాను.

సింహాద్రి నోరెత్తబోతుండగా మరొకటీ, ఇంకొకటీ అంటూ ఉక్కిరిబిక్కిరి చేశాను. సింహాద్రి పారిపోయాడు.

"హుఁ.. ఏ బాధైనా స్వయంగా అనుభవిస్తేనే కానీ తెలిసిరాదు!" సింహాద్రిని చూసి వ్యాఖ్యానించింది సుందరి.

తరువాత మరో రెండురోజులు నేనే స్వయంగా ఇద్దరి ఇళ్లకూ వెళ్లి కవితాగానాలు చేశాను.

నాలుగురోజులు ప్రశాంతంగా గడిచాయి.

ఒకరోజు ఇంటి ఓనరమ్మ వచ్చి తలుపు తట్టింది. "వెంకట్రావుగారూ! వచ్చే నెలనుంచి అద్దె నెలకు మూడువేలివ్వాలి!" బాంబు పేల్చింది.

"అదేమిటండీ, ఎన్నాళ్లయినా అద్దె పెంచం అన్నారుగా!" దిగ్భ్రాంతి చెందుతూ అన్నాను.

"అది అప్పటిమాట! ఈ బజారులోని కవులిద్దరూ ఇళ్లు అమ్ముకుని వెళ్లిపోయారు. అద్దె ఇళ్లకోసం జనం వరదలా వస్తున్నారు. ఇది త్వరలో ఉప్పెనగా మారే సూచన ఉన్నది. ఏ విషయమూ సాయంత్రంలోపల చెప్పండి!" అని వెళ్లిపోయింది.

స్పృహతప్పి పడిపోయాను. ■